
# ఫర్గెటిట్

**సత్యం మందపాటి**



✱ త్రివేండ్రం — మద్రాస్ ఎక్స్‌ప్రెస్ దిగి— మద్రాస్ ఎగ్మూర్ స్టేషన్‌లో నుంచి బయటకు వచ్చారు మంజుల, గోపాలం.

టాక్సీలో కూర్చుని, అలసటతో వెనక్కు వాలింది మంజుల.

గోపాలం నవ్వాడు. 'అప్పుడే అలసి పోయావా— మన పదిరోజుల హనీమూన్‌కే అలసిపోతే -పదికాలాలపాటువుండే సంసారాన్ని ఏం ఈదగలవు?' అన్నాడు ఆమెను కొంచెం దగ్గరకు తీసుకుని, అందమైన ఆమె కళ్లల్లోకి చిలిపిగా చూస్తూ.

మంజుల చిరునవ్వు నవ్వింది. ఆ చిరునవ్వు గోపాలం కళ్లకి వేడిగా తగిలింది. ఆమె కంఠంలోనే టాక్సీవాడి ప్రశ్నకు జవాబుగా 'సెంట్రల్ స్టేషన్‌కు పోనీ' అన్నాడు.

కొంచెం దూరంగా వుందేమో మంజుల, గోపాలానికి దగ్గరగా జరిగింది.

'మంజూ!' మెల్లిగా అన్నాడు గోపాలం ఆమె చేతిలో చేయివేసి.

'ఊఁ!' అన్నది మంజుల కళ్లుమూసుకుని.

'ఎలావుంది మన హనీమూన్ ప్రయాణం!' గాలికి ఎగురుతున్న ఆమె ముంగురులను సర్దాడు.

'చాల బాగుంది. అనుకున్నదానికన్నా చాలా హాపీగా వుంది. బెంగుళూరుకన్నా ఊటీ, ఊటీకన్నా కొడైకెనాల్, కొడైకెనాల్ కన్నా' ఆమె ఆగింది.

'ఊఁ! కొడైకెనాల్ కన్నా ... తర్వాత ఏమిటి!' మెరుస్తున్న ఆమె పెదవులు చూస్తూ అన్నాడు.

అతని గుండెమీద మృదువుగా చూపుడు వేలితో కొట్టి, కళ్లు దించుకుంది మంజుల.

గోపాలం పెద్దగా నవ్వాడు. ఆమె భుజం మీద చేయివేశాడు. దగ్గరకు తీసుకోబోయాడు.

'సెంట్రల్ స్టేషన్ వచ్చింది సార్!' అన్నాడు టాక్సీడ్రైవర్.

మంజుల దూరంగా జరిగింది.

గోపాలం టాక్సీలోంచి దిగి, మంజుల దిగేదాకా తలుపుతీసి పట్టుకున్నాడు. ఆమె దిగుతున్నప్పుడు 'మెల్లగా దిగు—జాగ్రత్త' అని కూడా అన్నాడు.

ఆమె నవ్వింది— అందమైన పలువరుస తళుక్కుమని మెరిసేలా.

సామాన్లు ప్లాట్‌ఫారంమీద పెట్టించి, కూలీని పంపించేసి— మంజులతో అన్నాడు గోపాలం.

'హౌరామెయిల్ బయల్దేరటానికి యింకా చాలా టైముంది—మనకి రిజర్వేషన్ కన్

ఫర్మ్ అయింది కనుక దిగులులేదు — ఈ 'లోపల భోజనంచేసి రావటం మంచిది!'

మంజుల వెంటనే అన్నది. 'ఇవాళ శనివారం. మరచిపోయారా— టిఫిన్ చేద్దాం!'

గోపాలం గుర్తుతెచ్చుకున్నాడు. పెళ్లయిన వెంటనే మేజువాణి రోజునే భోజనం చేయలేదు మంజుల — శనివారమని. అదేం మొక్కోగాని, ఆరోజు ఎంతమంది చెప్పినా వినలేదు మంజుల. ఆమె అజ్ఞప్రకారం తనూ శనివారం రాత్రి భోజనం చేయటం మానేశాడు.

'సరే ... యిక్కడే వుండు. వస్తాను!' అంటూ కాంటీన్‌వేపు దారితీసాడు.

నడుస్తున్న గోపాలం ఒక్కసారిగా ఆగిపోయాడు. మైక్‌లో ఇంగ్లీష్‌లో ఎనౌన్స్‌మెంటు వస్తున్నది. 'ముల్కీ రద్దుచేయాలని ఆంధ్రలో చేస్తున్న ఆందోళనవల్ల ఈరోజు హవురామెయిల్, సర్కార్ ఎక్స్‌ప్రెస్, రద్దుచేయటమైనది. ఆ ప్రయాణీకులు టిక్కెట్లు తిరిగి యిచ్చేసి, డబ్బు వాపస్ తీసుకోవచ్చును.' ఇంగ్లీష్‌లో అవగానే తమిళంలో చెబుతున్నది అనౌన్సర్.

ఒక్కసారిగా దగ్గరేవున్న కౌంటర్ దగ్గరకు వెళ్లాడు గోపాలం. 'మే ఐ హెల్ప్ యూ!' అని వ్రాసివున్నదక్కడ. జనం గుంపులుగా వున్నారక్కడ.

ఎవరో ఆయన తెలుగులో అంటున్నాడు. 'నిన్న, ఎయిర్‌కండిషన్డ్ ట్రెయినాపేసి, రైలుపెట్టెలు విరగగొట్టారు మనవాళ్లు. రైళ్లు ఆపినా ఫరవాలేదు కాని, పాడుచేస్తే యెలా— అందుకే అన్నిరైళ్లూ కాన్సిల్‌చేశారు. యిప్పుడువెళ్లే జి.టి తప్పిస్తే యిక నాలుగయిదు రోజులదాకా మనవేపు వెళ్లె రైలే లేదుట. తరువాతకూడా పరిస్థితి బాగుంటేనేట నడవటం రైళ్లు!'

రైళ్లు నడవటంలేదని వినగానే గోపాలం గుండెల్లో రైళ్లు పరుగెత్తినయి.

ఆయన్నే అడిగాడు. 'జి. టి. ఎన్నింటికి' అని.

ఆయన అన్నారు. 'ఏడూ నలభయి అయిదుకి ప్లాట్‌ఫారంమీద రెడీగా వుంది. యింకో పావుగంటలో బయల్దేరుతుంది— మీరెక్కడికి వెళ్లాలి?'—

'తెనాలి!' గాభరా గాఅన్నాడు గోపాలం.

'తెనాలిలో జి. టి. ఆగదు. బెజవాడ దాకా టిక్కెట్టు ఎక్స్‌టెండ్ చేయించు

# ఫర్ గెటిట్

కోండి!' అన్నాడాయన.

గబగబా అందర్నీ ప్రక్కకుతీసి ముందుకు వెళ్లి కౌంటర్‌దగ్గర నిలబడ్డాడు గోపాలం. అక్కడవున్న టిక్కెట్టు కలక్టర్‌తో యింగ్లీష్‌లో చెప్పాడు గోపాలం — తన టిక్కెట్టు తెనాలిదాకా వుందనీ, విజయవాడదాకా పెంచమనీ—

ఆయన గోపాలన్ని నిర్లక్ష్యంగా చూశాడు.

మళ్లీ చెప్పాడు గోపాలం—

'ట్రెయిన్ దగ్గర టి. టి. యి. వుంటారు. వెళ్లి ఆయన్ని అడగండి!' అన్నాడు.

టైము చూసుకున్నాడు గోపాలం. ఏడున్నర అవస్తూంది.

గబగబా పరుగెత్తాడు మంజులవున్న చోటుకి.

ఆమెకూడా ప్రకటన విన్నదేమో, ఆత్రుతగా గోపాలంకోసం చూస్తున్నది.

గోపాలం రాగానే అదే చెప్పబోయింది. గోపాలం వినిపించుకోకుండా హోల్డాలు భుజానవేసుకుని, సూట్‌కేస్ చేత్తోపట్టుకుని—'పద!' అన్నాడు దాదాపుగా పరుగెత్తుతూ.

మంజుల రొప్పుతూ అతనివెంట చకచకా నడిచింది.

జి. టి. లో జనాన్నిచూసి కళ్లు తిరిగినట్టయింది గోపాలానికి. కంపార్టుమెంటులో చోటులేక, కిటికీలోనించి కొంతమంది కాళ్లూ, కొంతమంది తలలూ అవకాశాన్ని బట్టి బయటకు పెట్టి కూర్చున్నారు. కూర్చున్నారో, నుంచున్నారోకూడా తెలుసుకోవటం కష్టంగావుంది.

మంజుల గాఢంగా నిట్టూర్చి, నుదుట పట్టిన చెమటను చిటికెన వేలికొనగోటితో తుడుచుకుంది.

'పెట్టెలోకి ఎక్కటం చాలాకష్టం!' అన్నాడు గోపాలం నీరసంగా.

'రిజర్వేషన్ వీలుంటుందేమో—'నసిగింది మంజుల.

అదే మామూలు సమయంలో అయితే అందమైన ఆమె పెదవుల మధ్యనుంచి అమాయకంగా వచ్చిన ఆమాటలతోపాటు, ఆ లేత పెదవులనూ ముద్దుపెట్టుకునేవాడే — కాని యిప్పుడుమాత్రం చిటపటలాడేడు.

చిన్న బుచ్చుకుంది మంజుల.

తెల్లకోటు కనపడగానే—ఒక్కఅంగలో గార్డునిచేరి అంతా గబగబాచెప్పి 'మా టిక్కెట్లు సెకెండ్ క్లాస్‌కి మార్చాలిసార్— ఐవిల్ పేది ఎక్సెస్ ఎమవుంట్!' అన్నాడు.

ఆయన నవ్వి 'ఇది గ్రాండ్ ట్రంక్ ఎక్స్‌ప్రెస్ మాష్టారూ — సెకెండ్‌క్లాస్ వుండదు—'

'పోనీ ఫస్ట్‌క్లాస్ — —'

'నెల రోజులముందే రిజర్వేషన్ స్టార్టయిందికదా? యిప్పుడు ఖాళీవుందనేనా మీ వుద్దేశ్యం'—గోపాలం నువ్వు అమాయకుడివోయ్ అన్నట్టుచూసి ముందుకు కదిలాడాయన.

'వేరే రైళ్లుకూడా ఏమీ లేవాసార్!'

'యివాళేకాదు — నాలుగు రోజులదాకా విజయవాడవేపు వెళ్లే రైళ్లు లేవు!' అన్నాడాయన.

ఒక్క నిముషం ఆలోచించాడు గోపాలం. ఏదో వీరావేశం వచ్చింది.

గబగబా హోల్డాలు, సూట్‌కేసూ పట్టుకుని 'పద!' అన్నాడు మంజులతో.

ట్రెయిన్ ఈ చివరనుంచి, ఆ చివర వరకు నడిచారిద్దరూ. భారతదేశంలో కుటుంబ నియంత్రణ అవసరం ఎంత వుందో అర్థమయింది యిద్దరికీ అక్షణంలో.

నిట్టూర్చింది మంజుల.

ప్రక్కనేవున్న ఆడవాళ్ల పెట్టెలో ఎక్కాడు గోపాలం.

'కమాన్!' అని అరిచాడు.

మనుషుల్నీ, సామాన్లనీ తొక్కుకుంటూ ముందుకు నడుస్తూ, మంజులకు దారి చేశాడు. ఒక ముసలావిడ హిందీలో గోపాలాన్ని తిట్టడం ప్రారంభించింది.

'నువ్వెంత తిట్టినా నాకు తెలీదులే— నాకు హిందీరాదు!' అంటూనే ఆవిడకాలుమీద తన బూటుకాలువేసి ముందుకు నడిచాడు.

పైన సామాన్లు పెట్టుకునే చెక్కమీద పెట్టెలన్నీ ప్రక్కకుసర్ది అక్కడ కూర్చోటానికి కొంచెం స్థలం సంపాదించాడు గోపాలం.

'ఎక్కు' అన్నాడు గోపాలం

అప్పటిదాకా రిజర్వేషన్లతో రైళ్లలోనూ, చక్కటి హోటళ్లతోనూ కాలక్షేపం చేసినకొత్త పెళ్లికూతురు మంజుల

ఒక్కసారిగా బిత్తరపోయింది—

ఆమె తేరుకునేలోగానే — చటుక్కున ఆమెను ఎత్తి పైన కూర్చోపెట్టాడు గోపాలం.

ఆమె సర్దుకునేలోపునే— 'టిక్కెట్టు ఎక్స్‌టెండ్ చేయించి. టిఫిన్ పట్టుకొస్తాను' అంటూనే ఆ ప్రజావాహిని భుజస్కంధాలపైన అడుగులువేస్తూ బయటకు వచ్చాడు. అతన్ని ఒకావిడ తమిళంతోనూ, ఒకావిడ హిందీలోనూ — అంతెందుకు అన్నిభారతీయ భాషల్లోనూ తిడుతున్నారు గోపాలాన్ని లోపలి ఆడవాళ్ళు, అయినా గోపాలం ఖాతరుచేయలేదు. గబగబా కాంటీన్‌కివెళ్ళి టిఫిన్ పట్టుకొచ్చాడు. కిటికీలోనుంచి మంజులకు అందించాడు. ఆమెపైన సామాన్ల చెక్కమీద ఒకమూల గువ్వలా కూర్చుని చిటపటలాడుతున్నది.

గోపాలం అక్కడ ఆగలేదు. ట్రెయిన్ దగ్గరవున్న టి. సి ని టిక్కెట్టు ఎక్స్‌టెంషన్ అడిగాడు.

ఆయన 'అది నాపని కాదండీ—అక్కడ కౌంటర్ దగ్గరకు వెళండి!' అన్నాడు.

'అక్కడ అడిగను — మిమ్మల్ని కలవమన్నారు!'

'నేను చెబుతున్నానుగదా! వెళి ఆయన్ను కలవండి!'

గోపాలం మళ్ళీ కౌంటర్ దగ్గరకు పరుగెత్తాడు. అక్కడవున్న జనాన్ని ప్రక్కకునెట్టి, ముందుకు వెళ్ళి అడిగాడు.

ఆయన అన్నాడు 'యిక్కడ కాదు ట్రెయిన్‌దగ్గరకు వెళ్ళండి!'

గోపాలానికి చిర్రెత్తుకొచ్చింది. 'అక్కడడిగితే యిక్కడంటారు — యిక్కడడిగితే అక్కడంటారు — ఏమిటి మీ ఉద్దేశ్యం!' అంటూ దులిపేశాడు.

ఆయన కూడా దులిపేసుకున్నాడు కాబోలు గోపాలంకేసి చూడకుండా— ఇంకెవరికో జవాబు చెబుతున్నాడు.

గోపాలానికి కంపరమెత్తింది. జుట్టు పీక్కున్నాడు. ఈలోపలే జి. టి. కూత కూసి మెల్లగా బయల్దేరింది కూడా.

అతను కాలేజీలో చదివేటప్పుడు అథ్లెటిక్స్‌లో ఛాంపియన్. అది గుర్తుకు తెచ్చుకొని, ఒక చిన్న హైజంపు, ఒక చిన్న లాంగ్‌జంప్‌చేసి జనంలోంచి బయట పడ్డాడు. అడ్డువచ్చిన ఆయన చేతిలోని మరచెంబును డిస్కస్ త్రోచేసి, హండ్రడ్ మీటర్స్ డాష్‌లోలా పరుగెత్తి — అందుబాటులోవున్న కంపార్టుమెంటుయెక్కి, ఊపిరి పీల్చుకున్నాడు.

పీల్చిన గాలిని పూర్తిగా బయటకు వదలక ముందే కండక్టర్ అడిగాడు 'టిక్కెట్టు ప్లీజ్' అని.

గోపాలం టిక్కెట్టు అందించాడు. ఆయన టిక్కెట్టుచూసి— నల్లటి తన ముఖంలోకి ఎర్రటి కోపాన్ని తెచ్చుకొనటానికి ప్రయత్నం చేశాడు. చేస్తూనే అన్నాడు. 'ఇది త్రీటైరు స్లీపరండీ — చదువుకున్న వాళ్ళు మీరే యిలాచేస్తే ఎలా — జనం మరీ బరితెగించి పోతున్నారు!' సణుగుతున్నాడాయన.

గోపాలం తన ఎర్రటి ముఖంలో కందిన కోపాన్ని కనపడకుండా దాచుకున్నాడు. దాచుకుని పరిస్థితి అంతా చెప్పాడు. టిక్కెట్టు ఎక్స్‌టెండ్ కూడా చేయమన్నాడు. దయవుంచి రెండు బెర్తులు యివ్వగలిగితే సంతోషించి, తరువాత స్టేషన్లో వాళ్ళావిడను కూడా ఈ పెట్టెలోకే తెస్తానన్నాడు. అంతే కాక హనీమూన్‌కపుల్ ఒకే పెట్టెలో వుండటం భావ్యం కాదాసార్ అని కూడా అన్నాడు.


ఆయన అంతావిని — 'మంచిది. ఇప్పుడెలాగూ రైలు బయల్దేరింది కనుక పెట్టె మారటానికి అవకాశంలేదు. కనుక వచ్చే స్టేషన్‌లో మీరుదిగి — వేరే యింకెక్కడయినా కూర్చోండి. లేకపోతే బలవంతంగా దింపవలసి వస్తుంది' అంటూ మిగతా వాళ్ళ టిక్కెట్లు చెక్ చేయటానికి బయల్దేరాడు.

గోపాలానికి ఏం చేయాలో తెలీకపోతే జుట్టు పీక్కోనే అలవాటుంది. ఇప్పుడూ అదేపని చేశాడు. కొడైకెనాల్ హోటల్లో వాళ్ళావిడ యితని జుట్టులో వేళ్ళువుంచి ప్రేమగాచూస్తూ — ఒక్కసారిగా కెవ్వుమని అరచి 'మీతలమీద కొన్ని తెల్లవెంట్రుకలు వున్నయ్యండోయ్' అన్నది. యిప్పుడు జుట్టుపీక్కోగానే, ఆ తెల్లవెంట్రుకలే వూడి వచ్చినయి. అయినా సంతోషించలేదు గోపాలం.

ప్రక్కనేవున్న సర్దార్జీ అన్నాడు ఇంగ్లీష్‌లో—'మీరేం భయపడకండి. మొత్తం రిజర్వేషన్ లేకుండా యిక్కడ ముగ్గురం వున్నాం. మనం ముగ్గురం యిక్కడొక యూనియన్‌ఫారం చేద్దాం. కండక్టర్‌తో దిగంఅనిచెబుతాం. మరీ గొడవచేస్తే—కాస్తో కూస్తో పారేద్దాం. నోరుమూసుకుంటాడు'

గోపాలం సర్దార్జీవేపు భక్తితో చూశాడు. గడ్డం అడ్డం వచ్చింది కానీ లేకపోతే సర్దార్జీ ఆపదలో వున్నవాళ్ళని ఆదుకునే శ్రీకృష్ణ పరమాత్ముడిలా కనిపించేవాడు గోపాలం కళ్ళకి.

గోపాలం, సర్దార్జీ, ఇటార్సీపోయే




'ఇదివరకు స్కూల్లో చదివేటప్పుడు ఇలా రింగులు తెప్పించడం చాతయ్యేది కాదోయ్! ఇప్పుడు కాలేజీలో చేరింతర్వాత చాలా కష్టపడి నేర్చుకున్నా!''

అతనూ, ముగ్గురూ, టాయిలెట్ దగ్గర నేలమీద పేపర్లు పరుచుకుని కూర్చున్నారు.

సర్దార్జీ, ఇటార్సీతో ఏదో చెబుతున్నాడు.

గోపాలం ఆలోచిస్తున్నాడు. మంజుల అలా ఎంతసేపు కూర్చోగలదు ? తను కనవడితే తన్ని తగలేయదుగదా ? సామాను భద్రంగా వుంటుందా ? కండక్టర్ తన టిక్కెట్టు ఎక్స్‌టెండ్ చేస్తాడా ? అసలు తనని యిక్కడ ఎంతసేపు కూర్చోనిస్తాడు? రైలాగగానే బయటకు గెంటుతాడా ? ఈ ప్రశ్న లన్నింటికీ జవాబులు కావాలంటే వెంటనే వెండితెరపై———

మళ్లీ జుట్టుపీక్కున్నాడు గోపాలం.

గోపాలం జుట్టువేపు ఒకసారిచూసి, తన గడ్డం సర్దుకున్నాడు సర్దార్జీ.

ఇటార్సీ అన్నాడు 'గట్టిగా దిగమంటే—చేయితడువుదాం!'

సర్దార్జీ తలూపి హిందీలో ఏదో అంటున్నాడు.

మంజుల ఎలావుందో ఏమిటో అనుకుంటున్నాడు గోపాలం అందుకే రైలాగగానే, దిగి గబగబావెళ్లి కిటికీలోనుంచి చూశాడు.

మంజుల నిద్రకళ్లతో అలాగే అక్కడే కూర్చుని వున్నది. టిఫిన్‌చేసిన ఛాయలు లేవు.

గోపాలాన్ని చూసి ముడుచుకొని 'వచ్చారూ!' అన్నది మాటను సాగదీస్తూ.

ఇబ్బందిగా నవ్వాడు గోపాలం. 'అక్కడ కూర్చోవటం సుఖంగావుందా!' అన్నాడు.

'ఆఁ! బోలెడు. మీరూ రండి. సుఖంగా కూర్చోవచ్చు!' మాతితోపాటు ముక్కునీ తిప్పింది మూడు వంకర్లు.

'అదికాదు మంజూ...' ఏదో అనబోయాడు.

'సరేలెండి! వెళ్లండి— రైలు బయల్దేరుతుంది!' అన్నది.

నిజంగానే రైలు బయల్దేరటంవల్ల — గబగబావచ్చి మళ్లా అదే స్లీపర్ కోచ్‌లో ఎక్కాడు గోపాలం.

'మళ్లీ ఎక్కారూ' అన్నాడు కండక్టర్.

ఏమనాలో తెలీక, అదోరకంగా నవ్వాడు గోపాలం.

'చదువుకున్నవాళ్లే యిలా రూల్స్‌ను అతిక్రమిస్తే ఎలాగండీ...' సణుగుతున్నాడు కండక్టర్,

కాసేపాగి అడిగాడు గోపాలం టిక్కట్టు ఎక్స్‌టెంషన్ కావాలని.

'నేనెట్లా చేస్తానండీ—మీరు మద్రాస్ స్టేషన్‌లోనే చేయించవలసింది !' విసుక్కున్నాడాయన.

గోపాలం ఆయనకు కొంచెం దగ్గరగా జరిగాడు. ఆయన కళ్లల్లోకి చూశాడు. ఆయన కళ్లల్లో అందాలు వెదకటానికి కాదు— కొంచెం చనువుతీసుకుందామని మెల్లగా అన్నాడు. 'ఎంత ప్రయత్నం చేసినా కుదరలేదు సార్ — ఎలాగు మీరున్నారు కదా తప్పక సహాయం చేస్తారనే ధైర్యంతో...'

ఆయన సణుగుతూ 'యిలా యివ్వండి మీ టిక్కెట్టు!' అన్నాడు.

గోపాలం టిక్కెటు అందించాడు. ఆయన టిక్కెట్టు వ్రాసి 'రెండోమనిషి యెక్కడ!' అన్నాడు.

'అవతల ఆడవాళ్ల పెట్టెలో'—చూడండి సార్ మా బాధ అన్న పద్ధతిలో చెప్పాడు. అవకాశమిస్తే భార్యాభర్తల్ని విడదీయటం మహా పాపం అని కూడా చెప్పేవాడే. కాని కండక్టరు 'మూడురూపాయలు యివ్వండి!' అన్నాడు టిక్కెటు వ్రాసి.

గోపాలం అయిదురూపాయలనోటు అందించాడు. ఆయన టిక్కెట్టు యిచ్చాడు కాని మిగిలిన రెండురూపాయలూ యివ్వ లేదు. గోపాలం అడిగే అంతలో ఆయన అన్నాడు. 'చూడండి — యిది రిజర్వేషన్ పెట్టె దీన్లో రిజర్వేషన్ లేనివాళ్లు ఎక్క కూడదు. కనుక మీరు దిగిపోవాలి వెంటనే!'

గోపాలం యిబ్బందిగా ముఖం పెట్టాడు.

'సరే మీరు మరీ మరీ అడుగుతున్నారు కనుక— నా డ్యూటీ అయేదాకా, అంటే బెజవాడ వచ్చేదాకా మీరు యిక్కడే కూర్చోండి— తరువాత మాత్రం పెట్టె మారాలి!' అంటూ వెళ్లిపోయాడు.

తర్వాత పెట్టె మారటమేం అసలు రైలే దిగుతాం అనుకున్నాడు గోపాలం. రెండురూపాయలు యిక ఆయన తిరిగి యివ్వడనీ తెలుసతనికి.

కునికిపాట్లు పడుతున్న గోపాలం—కలవరింతగా 'మంజూ — మంజూ—' అన్నాడు ప్రక్కనవున్న సర్దార్జీ భుజంమీద చేయివేసి,


సర్దార్జీ గోపాలాన్ని విదిలించటంతో, మెళుకువ వచ్చింది.

'సారీ!' అన్నాడు.

ఇటార్సీవాలా అంటున్నాడు 'అంతా మీ తెలుగువాళ్లవల్లే వచ్చింది—మీకు వేరేరాష్ట్రం కావాలంటే అడగవలసిన పద్ధతి యిదేనా ? రైళ్లూ, బస్సులూ, లారీలు తగలబెట్టి, ప్రయాణీకులకు అసౌకర్యం కలిగిస్తే మీ కోరికలు తీరతాయా ? గవర్నమెంటు ఆస్తిని పాడుచేస్తే నష్టపోయేదెవరు?'

'మీరు చెప్పింది నిజమే! అటువంటివి చేయకూడదు, బస్సులు తగలబెట్టి, రైళ్లాపితే మన సమస్యలు తీరవు. కాని

## ఫర్‌గెటిట్



ప్రభుత్వం కుంభకర్ణుడిలా నిద్రపోతున్నది. ఎన్నివిధాల లేపినా లేవనప్పుడు, గొడవ చేయాల్సి వస్తున్నది. అందుకే అలా చేస్తున్నారు' అన్నాడు గోపాలం.

ఇటార్సీవాలా అన్నాడు. 'మీ రాష్ట్రం మాత్రమే కాదు. ఇప్పుడు దేశం అంతా అలానేవుంది. విద్యార్థులూ, కార్మికుల అందోళన ఎక్కువ అయిపోయింది. అరాచకం పెరిగిపోయింది!'

సర్దార్జీ అన్నాడు 'ప్రభుత్వంలో పెరిగింది కనుకనే ప్రజలలోనూ అరాచకం, లంచం, కల్తీ, దగా అన్నీ పెరిగాయి!'

గోపాలం ఏమీ మాట్లాడలేదు.

వేగంగా వెడుతున్న రైలు, ఒక్కసారిగా స్పీడుతగ్గి, ఆగిపోయింది.

గోపాలం కిటికీలోనుంచి బయటకు చూశాడు. తెనాలి స్టేషన్. తెనాలిలో జి. టి. ఆగదుకదా అన్నాడు. యింతలోనే 'ఆంధ్ర జిందాబాద్!'—మొదలైన నినాదాలు వినపడ్డాయి. ఇరవై ముప్ఫయిమంది విద్యార్థులు ప్లాట్‌ఫారంమీద ఇటూ అటూ పరుగెత్తుతున్నారు వెంటనే అర్థమయింది గోపాలానికి విద్యార్థులు అక్కడ రైలు ఆపేశారన్నమాట.

ఇటార్సీవాలా సణుగుతున్నాడు.

గోపాలం ఒక్కక్షణం ఆలోచించాడు. ట్రెయిన్ దిగాడు. ప్లాట్‌ఫారం మీద చాల మంది వున్నారు. డ్రయివర్నీ, గార్డునీ క్రిందకు దించేశారు నినాదాలు చేస్తున్నారు.

గోపాలం గబగబా లేడీస్ కంపార్టుమెంటుదగ్గరకు పరుగెత్తాడు.

మంజుల అలానే, అక్కడే కూర్చుని, ఎందుకాగిందో, ఎక్కడాగిందో అర్థంకాక అదోలా బిత్తర చూపులు చూస్తున్నది.

గోపాలం. 'మంజూ! రైలు తెనాల్లో ఆగింది — దిగు' అని అరిచాడు.

అరుస్తూనే గబగబా జనాన్ని తోసుకుని లోపలకువెళ్లి సామాను బయటకు తెచ్చి ఊపిరిపీల్చుకున్నాడు.

మంజులకు ఒళ్లు నెప్పులుగా వున్నాయి కాబోలు, ఒళ్లు విరుచుకుని, ఆవలించింది కూడా.

గోపాలం ఆమెవేపు ప్రేమగా, జాలిగా చూశాడు.

మంజుల చిరుకోపంతో చూసిందతన్ని.

స్టేషన్ బయటకువచ్చి, రిక్షా ఎక్కిన తర్వాత మంజుల భుజంమీద చేయివేశాడు గోపాలం.

అతని చేతిని విదిలించింది మంజుల. ఆమె చక్కటి ముక్కుమీద కోపం తెలుస్తూనే వుంది.

గోపాలం అన్నాడు. 'మంజూ — నన్ను క్షమించు— చక్కటి మన హనీమూన్ ప్రయాణం చివరిలో యిలా బెడిసి కొట్టినందుకు!'

మంజుల అతనివేపు సూటిగా చూసింది. గోపాలం జుట్టు రేగివుంది బాగా అలసటగా కనబడుతున్నాడు.

'ఛీ— భలేవారండీ— ఎలాగోలా యింటికి చేరాం. సంతోషించండి!' అన్నది అతనికి దగ్గరగా జరిగి.

'కానీ...ఈ ప్రయాణం...'

ఇంకా అనబోతున్న గోపాలాన్నీ వారిస్తూ 'ఫర్ గెటిట్ డార్లింగ్ ఫర్ గెటిట్!' అన్నది మంజుల అతని హృదయంమీద తలవుంచి, తన్మయత్వంతో కళ్లుమూసుకుని. ●



'బాటసారి'

(నఖచిత్రం : శ్రీ సంపత్ కుమార్)